

సోమశిలలో 8.523 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం నాటికి 8.523 టీఎంసీలు ఉన్నాయి. ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,370
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,754
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,957
నవర (8 గ్రాములు)	రూ.55,656



ఏఎంసీ ఉద్యోగి ఆత్మహత్య

తెట్టు ఏఎంసీ చెక్‌పోస్టులో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వేధింపులే కారణమని బంధువులు ఆరోపించారు. 8లో

అంతులేని విషాదం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు | ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం

గుండెల్ని పిండే విషాదం. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి స్థిర పడ్డారు. శ్రీరామ నవమి ఉత్సవాల నేపథ్యంలో సొంతూరుకు కుటుంబ సమేతంగా వచ్చారు. కావలిలో షాపింగ్ చేద్దామని కారులో బయలుదేరారు. పల్లె రహదారుల మీదుగా వచ్చి చెన్నై–కోల్‌కోతా హైవే ఎక్కారు. ఆ తరువాత కొద్ది సేపట్లోనే ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో రెండేళ్ల చిన్నారి సహా ఐదుగురు కుటుంబ సభ్యుల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అర్ధగంట ముందు వరకు తమ కళ్ల ముందే కలివిడిగా తిరిగిన వారంతా విగతజీవులుగా మారడంతో అంతులేని విషాదం అలముకుంది. మితిమీరిన వేగం ఆ కుటుంబాన్ని కబళించింది. మృతులంతా ఒకే కుటుంబం. విషయం తెలుసుకున్న ఊరు ఊరంతా ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరైంది.



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ కే శ్రీనివాసరావు



లక్ష్మమ్మ మృతదేహం



తల్లీబిడ్డ నీలిమ, నందు మృతదేహాలు

- ఉలికిపడిన చామదల
- ప్రాణాలు తీసిన మితిమీరిన వేగం
- రోడ్డెక్కిన కొద్దిసేపటికే ఘోరం

కావలి/జలదంకి: జలదంకి మండలం చామదలకు చెందిన దావులూరి శ్రీనివాసులు (51) హైదరాబాద్‌లో సిమెంట్ వ్యాపారం చేస్తున్నాడు. కుటుంబంతో సహా అక్కడే స్థిర పడ్డాడు. శ్రీరామనవమి ఉత్సవాల నేపథ్యంలో భార్య వరలక్ష్మి (45), వదిన లక్ష్మమ్మ (48), కుమార్తె నీలిమ (24), మనుమడు నందు (2)తో కలిసి సొంతూరికి వచ్చారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసుకుని షాపింగ్ నిమిత్తం కారులో కావలికి బయలుదేరారు. దావులూరి శ్రీనివాసులు కారు డ్రైవ్ చేస్తున్నాడు. ముందు సీట్లో భార్య వరలక్ష్మి, వెనుక సీట్లో వదిన లక్ష్మమ్మ, కుమార్తె నీలిమ, మనుమడు నందు కూర్చున్నారు. చామదల నుంచి కావలికి చేరుకునేందుకు మూడు మార్గాలు ఉన్నాయి. బ్రాహ్మణక్రాక, తొమ్మిదో మైలు, జలదంకి మీదుగా కావలి చేరుకోవచ్చు. మరో మార్గంలో తాళ్లూరు, బోగోలు మీదుగా చెన్నై–కోల్‌కత్తా హైవేకు చేరుకోవచ్చు. దగ్గరగా ఉంటుందని, ట్రాఫిక్ సమస్య ఉండదని తాళ్లూరు మీదుగా కొండబిట్రగుంట నుంచి చెన్నై–కోల్‌కత్తా హైవేలోకి వచ్చారు. కారు హైవే ఎక్కిన వెంటనే వేగాన్ని బాగా పెంచాడు. అక్కడి నుంచి అర కిలోమీటరు దూరంలోనే శివకాశి నుంచి జార్ఖండ్‌కు అగ్గిపెట్టెల లోడుతో వెళుతున్న లారీ రోడ్డు మార్జిన్‌లోనే ఆగి ఉంది. ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న అగ్గిపెట్టెల లారీని రెప్పపాటు వ్యవధిలోనే కారు ఢీకొట్టింది.



లక్ష్మమ్మ(ఫైల్)



గంటా నీలిమ (ఫైల్)



నందు (ఫైల్)



కారు ముందు సీట్లో విగతజీవులుగా శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతులు (ఇన్‌సెట్‌లో) దావులూరి శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతులు(ఫైల్)

కారు వేగానికి లారీ కిందకు దూసుకుపోవడంతో అందులోని ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కారు ముందు భాగంతో పాటు మృతదేహాలు కూడా లారీ కింద ఇరుక్కుపోవడంతో ఘటనా స్థలం భీతావహంగా మారింది. కావలి రూరల్ సీఐ కే శ్రీనివాసరావు, కావలి డీఎస్పీ వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కావలి రూరల్ పోలీసులు లారీ కింది భాగంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కావలి రెడ్‌క్రాస్ బృందం సహాయక చర్యలు చేపట్టింది. ఈ మేరకు కావలి రూరల్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉలికి పడిన చామదల

ప్రమాద విషయం తెలిసిన వెంటనే చామదల ఉలికి పడింది. హైదరాబాద్ నుంచి వచ్చి అప్పటి వరకు అందరితో సరదాగా గడిపిన వాళ్లు అంతలోనే విగతజీవులుగా మారారనే విషయం గ్రామాన్ని కుదిపేసింది. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు గ్రామస్తులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కుప్ప కూలిపోయారు. కొన్ని నిమిషాల ముందు వరకు తమ కళ్లముందే ఉన్న వాళ్లు అంతలోనే మృత్యువాత పడటాన్ని జీర్ణించుకోలేకపోయారు. రెండేళ్ల చిన్నారి సహా అందరూ మృత్యువాత పడడంతో చూసిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు.

మృత్యు ఘంటికలు మోగిస్తున్న లారీలు

హైవేపై ఆగి ఉన్న లారీలు నిత్యం మృత్యు ఘంటికలు మోగిస్తూనే ఉన్నాయి. కావలి మండలం రుద్రకోట నుంచి దగదర్తి మండలం సున్నపుబట్టీ వరకు హైవేకు ఇరు వైపులా లారీలు ఇష్టం వచ్చినట్లు నిలిపేస్తున్నారు. ముఖ్యంగా దాబా హోటళ్లు, టిఫిన్ అంగళ్లు, కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్‌లోనే నిలుపుతున్న లారీల కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

న్యూస్‌రీల్

జీఐఎస్ సర్వేను త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జీఐఎస్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని విద్యుత్ భవన్‌లోని తన చాంబర్ నుంచి విద్యుత్ ఈఈలు, డీఈఈలు, ఏఈలు, అకౌంట్స్ ఆఫీసర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏఎస్ పేట, అనంతసాగరం, ఆత్మకూరు రూరల్, వింజమూరు, కావలి, దుత్తలూరు, ఇందుకూరుపేట, సీతారామపురం సెక్షన్ల పరిధిలో జీఐఎస్ సర్వే పనులు ఇంకా పూర్తవలేదని తెలిపారు. ఇప్పటికే ఆయా సెక్షన్ల అధికారులను పలుమార్లు హెచ్చరించామన్నారు. ఈ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బిట్రగుంట, బోగోలు ఫీడర్లకు సంబంధించిన సిబ్బంది బుధవారం నాటికి పనులు పూర్తి చేయపోతే వెంటనే వారిని రిలీవ్ చేయాలని కావలి ఈఈను ఆదేశించారు.

అక్క ఐఏఎస్.. తమ్ముడికి సివిల్స్ ర్యాంక్



తల్లితో సబ్‌కలెక్టర్ విద్యాధరి, కృష్ణ శ్రీవాస్తవ

కందుకూరు: కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి తమ్ముడు కృష్ణ శ్రీవాస్తవ మంగళవారం వెలువడిన సివిల్స్–2023 ఫలితాల్లో ఆల్ ఇండియా 444వ ర్యాంకు సాధించాడు. ఈ మేరకు తన తమ్ముడు సివిల్స్ ర్యాంకు సాధించినట్లు సబ్‌కలెక్టర్ విద్యాధరి వెల్లడించారు. ఒకే ఇంట్లో అక్కా, తమ్ముడు ఐఏఎస్ అధికారులుగా రాణించనున్నారు. వైఎస్సార్ జిల్లా నందలూరు మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన విద్యాధరి సివిల్స్–2020 ఫలితాల్లో జాతీయ స్థాయిలో 211వ ర్యాంకు సాధించి ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. శిక్షణానంతరం ఆమె మొదటి పోస్టింగ్‌గా ప్రస్తుతం కందుకూరు సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అదే బాటలో ఆమె తమ్ముడు కృష్ణ శ్రీవాస్తవ సివిల్స్ రాసి విజయం సాధించాడు. ఆయన 2023లో గ్రూప్–1 రాసి విజయం సాధించారు. జిల్లా రిజిస్ట్రార్‌గా ఎంపికై రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వీస్ పరీక్ష రాసిన ఆయన మంగళవారం వెలువడిన ఫలితాల్లో జాతీయ స్థాయిలో 444వ ర్యాంకు సాధించడంతో సబ్‌కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. తమ్ముడికి శుభాకాంక్షలు తెలిపారు.

వీఏఏపై కేసు నమోదు

సీతారామపురం(ఉదయగిరి): సీతారామపురం మండలం బాలాయపల్లి సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కే వెంకటపతి టీడీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన నేపథ్యంలో ఎస్సై అనూష మంగళవారం కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వం ద్వారా వేతనాలు పొందుతున్న వ్యక్తులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదు. అయినప్పటికీ కొందరు ఖాతరు చేయకుండా రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అధికారులు కేసులు నమోదు చేసి సస్పెండ్ చేస్తున్నారు. అయినా ఇంకా కొందరు ఉద్యోగులు ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తుండటం విశేషం.

మీ వాడ్ని.. మీలో ఒకడ్ని



కూరగాయలు విక్రయిస్తున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు సిటీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌ను వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి మంగళవారం సందర్శించారు. వ్యాపారులు, కూలీలతో మాటామంతి నిర్వహించి వారి యోగక్షేమాలను ఆరాతీశారు. మీ వాడ్ని.. మీలో ఒకడ్ని అంటూ వారితో మమేకమై భరోసా కల్పించారు. జగనన్న సారథ్యంలో ప్రభుత్వం మరోసారి ఏర్పడిన వెంటనే మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వ్యాపారి అవతారమెత్తి కూరగాయలను విజయసాయిరెడ్డి విక్రయించగా, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనుగోలు చేసి అక్కడి వారిలో నూతనోత్సాహాన్ని నింపారు.

నిరుద్యోగ రహిత నెల్లూరే లక్ష్యం

- ప్రతి ఆరు నెలలకోసారి జాబ్ మేళాలు నిర్వహిస్తాం
- ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిరుద్యోగ రహిత నెల్లూరే తన లక్ష్యమని, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి ఆరు నెలలకోసారి దేశంలోని ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి జాబ్ మేళాలు నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తెలిపారు. నగరంలోని రామ్మూర్తినగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన యువతతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పనే ప్రధాన లక్ష్యంగా జాబ్ మేళాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వారానికోసారి ప్రజాదర్బార్ నిర్వహిస్తామని చెప్పారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఎవరికి ఏ సమస్య వచ్చినా నేరుగా ప్రజాదర్బార్‌కు వచ్చి వినతులు ఇవ్వవచ్చని తెలిపారు. ముఖాముఖిలో యువత ప్రశ్నలకు జవాబిస్తూ నెల్లూరు అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించామని, అందులోని వాగ్దానాలను వంద శాతం నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరులో ఐటీ సెజ్, ఎయిర్ పోర్టు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. నెల్లూరు ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఎంపీ అభ్యర్థిగా తనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పంపించడం తన అదృష్టమన్నారు. దేశ ఉత్పాదకత పెంచే బాధ్యత యువతపై ఉందన్నారు. దేశాభివృద్ధికి, దేశాన్ని అవినీతి రహితంగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు కేవలం 34,108 ఉద్యోగాలు మాత్రమే కల్పించగా, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 2,22,000 శాశ్వత ఉద్యోగాలు కల్పించారని వివరించారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలేదని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దాన్ని యువత తిప్పికొట్టాలన్నారు. ఏపీ క్రికెట్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్సార్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో విశాఖపట్నంలో ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన సేవలు ఎవ్వరూ మర్చిపోలేరన్నారు. 30 వేల మందికి నిత్యావసర వస్తువులు అందించారన్నారు. 300 బెడ్లతో కోవిడ్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. హనీ గ్రూప్ అధినేత ఓబుల్‌రెడ్డి, యువత తదితరులు పాల్గొన్నారు.



ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన యువత

రేపట్నుంచి నామినేషన్ల స్వీకరణ

- నెల్లూరు ఎంపీతో పాటు 8 అసెంబ్లీ స్థానాలకు ఏర్పాట్లు పూర్తి
- విజయవంతంగా మాక్ నామినేషన్ ప్రక్రియ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్



మాక్ నామినేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. నెల్లూరు పార్లమెంట్‌కు సంబంధించి కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మాక్ నామినేషన్ ప్రక్రియ చేపట్టారు. నామినేషన్ల పరిశీలనకు తగిన సిబ్బందిని నియమించుకుని పరిశీలించారు. నామినేషన్ దాఖలు చేసిన వ్యక్తికి సంబంధించిన ఓటరు జాబితా పరిశీలనతో పాటు ప్రతిజ్ఞ, ఫీజు చెల్లింపు పత్రాలు, తదితర అన్ని కాలమ్స్‌ను పూర్తి చేసిన నామినేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ మొత్తాన్ని ఫొటోగ్రఫీ, వీడియో రికార్డింగ్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మాక్ నామినేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. నెల్లూరు ఎంపీతో పాటు 8 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ఆర్వో కార్యాలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో బాపిరెడ్డి, ఏఆర్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోలు వీరే..

ఎంపీ/ఎమ్మెల్యే స్థానం	ఆర్వో	నామినేషన్ కార్యాలయం
నెల్లూరు ఎంపీ	హరినారాయణన్	కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు
కందుకూరు	విద్యాధరి	సబ్‌కలెక్టర్ కార్యాలయం, కందుకూరు
కావలి	శీనానాయక్	ఆర్డీఓ కార్యాలయం, కావలి
ఆత్మకూరు	మధులత	మున్సిపల్ కార్యాలయం, ఆత్మకూరు
కోవూరు	మాధవన్	తహసీల్దార్ కార్యాలయం, కోవూరు
నెల్లూరు సిటీ	వికాస్‌మర్మత్	కార్పొరేషన్ కార్యాలయం
నెల్లూరు రూరల్	మలోల	ఆర్డీఓ కార్యాలయం, నెల్లూరు.
సర్వేపల్లి	చిన్నఓబులేసు	ఎంపీడీఓ కార్యాలయం, వెంకటాచలం
ఉదయగిరి	రాజారమేష్‌ప్రేమ్‌కుమార్	తహసీల్దార్ కార్యాలయం, ఉదయగిరి

డీసీపల్లిలో 856 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 856 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1093 బేళ్లు రాగా, 856 బేళ్లను విక్రయించామని, 237 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.250, కనిష్ఠంగా రూ.220, సగటున రూ.226 ధర పలికిందని తెలిపారు. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపట్నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ విరుపావరుల గిరికృష్ణ తెలిపారు. మంగళవారం వారు దేవస్థానంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. 18న రాత్రి 7గంటలకు అంకురార్పణ, 19న ఉదయం 9గంటలకు ధ్వజారోహణం, రాత్రి 7గంటలకు శేష వాహన సేవ, 20న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి హంస వాహన సేవ, 21న ఉదయం యాళి, రాత్రి చంద్రప్రభ వాహన సేవ, 22న ఉదయం చప్పరోత్సవం, రాత్రి వెండి హనుమంతసేవ, 23న ఉదయం మోహిని అలంకారం(గిన్నెబిక్ష), రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు చెప్పారు. 24న సాయంత్రం 6గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి 9గంటలకు గజ వాహన సేవ, 25న ఉదయం 9 గంటలకు రథోత్సవం, రాత్రి పుష్పక విమాన అలంకారోత్సవం, 26న ఉదయం వెణ్ణత్తాళి, రాత్రి అశ్వవాహన, 27న ఉదయం 9గంటలకు ముసుగులసేవ, రాత్రి పొన్న వాహన సేవ, 28న ఉదయం చక్రస్నానం, రాత్రి 7గంటలకు ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రంగరాజన్, శ్రీనివాసాచార్యులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- పాస్టర్లతో ఆత్మీయ సమావేశం
- టీడీపీకి ఓట్లు వేయాలంటూ ప్రచారం



పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కందుకూరు: మతం, కులం పేరుతో ఓట్లు అడగరాదు. ఆ విధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదని ఎన్నికల కోడ్ నిబంధనలు చెబుతున్నాయి. అయితే తెలుగుదేశం పార్టీ నాయకులకు ఇవేమీ పట్టడం లేదు. ఏకంగా పాస్టర్లతో బహిరంగంగానే మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించా రు. స్థానిక వెంగమాంబ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ సమావేశంలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పాల్గొని ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో పాస్టర్లంతా టీడీపీ గెలుపుకోసం పని చేయాలంటూ వారికి పలు హామీలు ఇచ్చారు. ఎక్కడా మతం పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదని చెబుతున్న ఎన్నికల అధికారులు టీడీపీ నిర్వహించిన పాస్టర్ల ఆత్మీయ సమావేశంపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

క్లుప్తంగా

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి


ఘటనా స్థలంలో గాయాలతో యువకుడు

సంగం: మండలంలోని కొరిమెర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు మంగళవారం వివరాలు వెల్లడించారు. కొరిమెర్ల గ్రామానికి చెందిన యోహాన్ (28) ఆటో డ్రైవర్. భార్య శారమ్మ, కుమారుడు ఉన్నారు. నెల్లూరులో వైద్యశాలలో చికిత్స పొందుతున్న తన బాబాయ్‌ను చూసేందుకు ఆదివారం అతను అన్నతో కలిసి కారులో నెల్లూరుకు వెళ్లాడు. తిరిగి సంగం వచ్చారు. అక్కడి నుంచి యోహాన్ బైక్‌పై కొరిమెర్లకు బయలుదేరాడు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న మరో బైక్‌ను యోహాన్ ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. శారమ్మ ప్రస్తుతం గర్భవతి. సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్నానదిలో మృతదేహం

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): పెన్నానదిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి చేతులు కట్టి ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని మెక్లిన్స్ రోడ్డులో ప్రసాద్ (45), ప్రసన్న దంపతులు ఉంటున్నారు. వారికి పిల్లలు లేరు. అతని మానసిక స్థితి బాగోలేదు. కొన్ని సంవత్సరాల క్రితం భార్య వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. పనులకు వెళ్లడం మానేశాడు. అప్పుడప్పుడు తన సోదరి వద్దకు వెళ్లి వచ్చేవాడు. ఏం జరిగిందో గానీ రంగనాయకులపేట కల్యాణ మండపం వెనుకవైపు పెన్నానదిలో మంగళవారం చనిపోయి ఉన్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారాజు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం ఉబ్బిపోయి ఉంది. చేతులు బనియన్‌తో కట్టి ఉన్నాయి. కాళ్లకు లుంగీ చుట్టి ఉంది. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. హత్యచేసి నీటిలో పడేసి ఉండొచ్చనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

నగదు, మద్యం స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు, అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. నవాబుపేట స్టేషన్ పరిధిలో రూ.5 లక్షలు, అల్లూరు పరిధిలో రూ.1,85,500, మనుబోలు పరిధిలో రూ.లక్ష, బుచ్చిరెడ్డిపాళెం పరిధిలో రూ.3 లక్షలు చొప్పున నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుడ్లూరు పరిధిలో 123, దుత్తలూరులో 21, సెబ్ అధికారులు 102 చొప్పున మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. కావలి, జలదంకి పరిధిలో పేకాట కేంద్రాలపై దాడులు చేసి ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.6,290 స్వాధీనం చేసుకున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.75
సన్నవి	రూ.60
పండ్లు	రూ.26

అండగా నిలిచాం.. ఓటుతో ఆశీర్వదించండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న మంత్రి కాకాణి

మనుబోలు: 'ఐదేళ్ల పాలనలో అన్ని విధాలుగా అండగా నిలిచాం. ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించండి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని వడ్లపూడి, గొట్లపాళెం, లింగారెడ్డిపల్లి, రాజోలుపాడు, నాయుడుపల్లి, వీరంపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి ఒక వైపు, హామీలను తుంగలో తొక్కి మోసం చేసిన చంద్రబాబు ఒక వైపు ఉన్నారని, ఎవరు కావాలో ప్రజలే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. తాను వ్యవసాయ శాఖ మంత్రి అయ్యాక మిల్లర్లను దూరం పెట్టి పారదర్శకంగా వ్యవహరించడంతో ధాన్యానికి గతంలో ఎన్నడూ లేనంత ధర లభిస్తోందన్నారు. పంటలకు సకాలంలో సాగునీరు అందించడమే కాకుండా వారికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా అందించామన్నారు. కరోనాతో ప్రజలు తల్లడిల్లిపోతున్న సమయంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రజలను గాలికొదిలేశాడన్నారు. భయంతో బెంగళూరు, హైదరాబాద్‌లో తలదాచుకున్నాడన్నారు. తాను మాత్రం అన్ని రకాలుగా నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచానని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ బియ్యం, నూనె పంపిణీ చేశామన్నారు. మరోసారి ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీటీసీ ఉన్నం లక్ష్మీనారాయణరెడ్డి, జట్టి సురేందర్‌రెడ్డి, బత్తల వెంకటేశ్వర్లురెడ్డి, చిట్టమూరు నరసారెడ్డి, ఈగా సురేష్, రఘురామిరెడ్డి, పెనుమల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రూరల్లో ప్రశాంత వాతావరణం తీసుకొచ్చా


ప్రచారం చేస్తున్న ఆదాల, వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం తీసుకొచ్చినట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 18వ డివిజన్‌లోని హరనాథపురంలో ఒకటి నుంచి 5వ వీధి వరకు మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ తాను రూరల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రౌడీయిజంపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. భవిష్యత్‌లో భూ కబ్జాలు, దౌర్జన్యాలు జరగకుండా చూస్తామన్నారు. డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేశామన్నారు. మిగిలిన వాటిని ఎన్నికల అనంతరం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, 18వ డివిజన్ కార్పొరేటర్ తోటకూర అశోక్‌కుమార్‌నాయుడు, నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, వేలూరు శివసునీల్‌రెడ్డి, వంశీ, రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పెనక రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న వైపే రాష్ట్ర ప్రజానీకం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


15వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, నాయకులు

ఆత్మకూరు: 'ప్యాకేజీలకు లొంగి పార్టీ మారే వారితో ఎలాంటి నష్టం లేదు. రాష్ట్ర ప్రజలు పూర్తిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 15, 16 వార్డుల్లో మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డితో కలిసి ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్షం కొంతమంది ప్రజా ప్రతినిధులను ప్రలోభాలకు గురిచేసి ప్యాకేజీలతో పార్టీలో చేర్చుకుంటోందన్నారు. దీంతో బలం పెరిగిందని అనుకుంటున్నారని, వాస్తవానికి అలాంటి వారికి ప్రజల ఆదరణ ఉండదన్నారు. గడిచిన మూడు రోజుల్లో పట్టణంలో వందల సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. గతంలో కంటే మరింత మెజార్టీ సాధిస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, నాయకులు ఐవీ రమణారెడ్డి, మైనార్టీ నాయకురాలు షేక్ పర్వీన్, ముజీబ్, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 40వ వార్డులో టీడీపీకి చెందిన 20 మంది కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. జెండా చెట్టు వీధిలో మాజీ కౌన్సిలర్ డేగా రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రతాప్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తేనే కావలి ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఇతర ప్రాంతాల వాళ్లకు అప్పగిస్తే నాశనం చేస్తారని చెప్పారు.

నియోజకవర్గాన్ని కాపాడుకోవాలన్నా, ప్రజలకు అవసరమైన అన్ని పనులు జరగాలన్నా ఎమ్మెల్యేగా రామిరెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. షేక్ ఇస్మాయిల్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ అఫ్రోజ్, బి.హజరత్తయ్య, షేక్ సలీం, షేక్ సుల్తాన్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు.

సివిల్స్‌లో ఉదయగిరి యువతి సత్తా


వినీష

ఉదయగిరి: యూపీఎస్సీలో మండలంలోని గంగులవారి చెరువుపల్లికి చెందిన బడబాగ్ని వినీష ప్రతిభ చూపింది. మంగళవారం ఫలితాలు విడుదల చేయగా 821 ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి శ్రీనివాసులు వ్యవసాయాధికారి. తల్లి విజయభారతి గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వినీష ప్రాథమిక విద్యాభ్యాసం నెల్లూరులో జరిగింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. మద్రాస్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివింది. అమెరికాలో ఎంఎస్ చేసింది. అనంతరం గ్రూప్–1 పరీక్షలు రాసి మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికైంది. ప్రస్తుతం విజయవాడలో పనిచేస్తోంది. తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో ర్యాంకు సాధించడం విశేషం. వినీష సోదరుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అతను కూడా సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు. మారుమూల గ్రామంలో జన్మించి, చదువులో రాణించి సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	142
లేయర్ (లైవ్)	98
బ్రాయిలర్ చికెన్	250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	280
లేయర్ చికెన్	167

మార్కెట్ చెక్‌పోస్ట్ ఉద్యోగి ఆత్మహత్య

- ఎస్సై వేధింపులే కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ
- మృతదేహంతో పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా
- న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన డీఎస్పీలు


మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

గుడ్లూరు: వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్ట్ ఉద్యోగి ఒకరు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వేధింపులతోనే అతను బలవన్మరణానికి పాల్పడ్డాడని బంధువులు ఆరోపిస్తున్నారు. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గుడ్లూరు మండలం గుండ్లపాళేనికి చెందిన పోకూరి సురేష్‌రెడ్డి (35)కి భార్య వసంత, ఇద్దరు కుమార్తెలున్నారు. అతను తెట్టు దగ్గర ఉన్న వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్ట్ వద్ద ఒప్పంద ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 11వ తేదీన తెట్టుకు చెందిన మరో యువకుడితో కలిసి సురేష్‌రెడ్డి విధులు నిర్వహిస్తుండగా ఎస్సై లక్ష్మణరావు అక్కడికి వెళ్లి హైవేపై వెళ్లే రేషన్ వాహనాల వివరాలను తెలియజేయాలని అడిగాడు. వాటి గురించి తనకు తెలియదని సురేష్‌రెడ్డి చెప్పాడు. వివరాలు నీకు తెలుసని, సహోద్యోగి అశోక్ మాకు అంతా తెలియజేశాడని ఎస్సై వాదనకు దిగాడు. తనకేమీ తెలియదని సురేష్ చెప్పడంతో ఎస్సై అతడి మీద దాడి చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. మోటార్‌బైక్, సెల్‌ఫోన్ తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేశారు. జరిమానా చెల్లిస్తే బైక్ ఇస్తానని చెప్పాడు. అయితే సురేష్‌రెడ్డి సెల్‌ఫోన్ ఇవ్వాలని ఎస్సై చుట్టూ తిరిగాడు. తనకు తెలిసిన నాయకుల చేత చెప్పించినా ఫోన్ ఇవ్వకపోగా తిట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సురేష్‌రెడ్డి మంగళవారం ఉదయం తన చావుకు ఎస్సై లక్ష్మణరావు కారణమంటూ లెటర్ రాసి ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన బంధువులు కిందకు దించి ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారణ అయింది. లెటర్ చూసిన కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతదేహాన్ని గుడ్లూరు పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లి ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కందుకూరు, నెల్లూరు డీఎస్పీలు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని మృతుడి తరఫు బంధువులతో మాట్లాడారు. విచారణ జరిపించి ఎస్సైపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇద్దరు చిన్నపిల్లలతో తాను ఎలా బతకాలంటూ భర్త మృతదేహం వద్ద వసంత కన్నీరుమున్నీరుగా రోదించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.


సురేష్‌రెడ్డి (ఫైల్)